## ట్రాక్టర్ బోల్తా: రైతు దుర్మరణం

భీమయ్య (ఫైల్)

డ్రైవింగ్ సీట్లో మృతి చెందిన భీమయ్య

చిగురుమామిడి, జనవరి 7: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన ఓ రైతు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గండ్రతి భీమయ్య(55) మంగళవారం తన వ్యవసాయ పనుల కోసం తీసుకువచ్చిన ట్రాక్టర్ డబ్బాను రేకొండ పరిధిలోని బండారుపల్లికి చెందిన వెంకటయ్య అనే రైతుకు అప్పగించి, గ్రామంలో ఉండే ఆంధ్రాకు చెందిన ఓ బాలుడితో కలిసి ట్రాక్టర్ ఇంజిన్‌తో బయలుదేరాడు. రాయించెరువు వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడడంతో భీమయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కన ఉన్న బాలుడు ఎగిరి పక్కన పడి త్రుటిలో తప్పించుకున్నాడు. స్థానిక రైతులు చూసి వెంటనే తమకు సమాచారం అందించగా, ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. కాగా, భీమయ్య మున్నూరు కాపు సంఘం గ్రామాధ్యక్షుడిగా, సీపీఐలో గ్రామ కార్యదర్శిగా సేవలందించారు. అతడి మృతికి సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకుడు బోయిని అశోక్ సంతాపం వ్యక్తం చేశారు.

## మచ్చ ప్రభాకర్‌కు ఘన నివాళి

తెలంగాణచౌక్, జనవరి 7: పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివంగత మచ్చ ప్రభాకర్ సేవలు మరువలేనివని సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్ పేర్కొన్నారు. నగరంలోని పద్మశాలీ కార్యాలయంలో మచ్చ ప్రభాకర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పద్మశాలీల ఐక్యత కోసం ప్రభాకర్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పోలు సత్యనారాయణ, గుడిమల్ల శ్రీకాంత్, గడ్డం శ్రీరాములు, మిట్టపల్లి ప్రవీణ్, మార్త ప్రకాశ్, వోడ్నాల రవీందర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

గంగాధర, జనవరి 7: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డీఆర్‌డీవో శ్రీధర్ ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ పనులను మంగళవారం పరిశీలించారు. గంగాధర నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి వనమహోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాము, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

గురుకులం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అదనపు కలెక్టర్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

# నాసిరకం పదార్థాలతోనే ఫుడ్ పాయిజన్

చికిత్స పొందుతున్న విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డా.వీరారెడ్డి

- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతరా..?
- శర్మనగర్ గురుకులం ఘటనపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు
- స్కూల్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నాలు
- అడ్డుకున్న పోలీసులు, ఇరువర్గాల మధ్య తోపులాట
- కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు
- రెండో పట్టణ సీఐ సముదాయింపుతో ఆందోళన విరమణ

కలెక్టరేట్, జనవరి 7: జిల్లాకేంద్రంలోని శర్మనగర్ మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో 31 మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, వసతి గృహ అధికారి, సిబ్బంది వారిని సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. విద్యార్థినులకు ప్రమాదం ఏమీ లేదని వైద్యులు ప్రకటించడంతో తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకోగా, తిరిగి అందరినీ హాస్టల్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే ఘటనపై విద్యార్థి, బీసీ సంఘాలతో పాటు రాజకీయ పార్టీల నాయకులు భగ్గుమన్నారు. గురుకులం వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్, ఆర్డీవో, బీసీడీవో, డీఎంహెచ్‌వో, ఆహార తనిఖీ అధికారులు హాస్టల్‌కు చేరుకుని ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. శాంపిళ్లు సేకరించి, పరీక్షల కోసం తమ వెంట తీసుకెళ్లారు. కాగా, హాస్టల్‌లో నెలకొన్న పరిస్థితులను విద్యార్థి సంఘాల నాయకులు పరిశీలించేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయా సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసులను తోసుకుని లోనికి వెళ్లబోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కాగా, నాసిరకం పదార్థాలతో భోజనం తయారు చేయడం వల్లే ఫుడ్ పాయిజన్ జరిగిందని, అందుకే తమను లోనికి అనుమతించడం లేదని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతుండగా, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ పాఠశాల బయటకు వచ్చి వివరణ ఇచ్చారు. విచారణకు ఆదేశించామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయినా, ససేమిరా అనడంతో రెండో పట్టణ సీఐ సృజన్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి అంజలితో వివరణ ఇప్పించి, ఆందోళన విరమించాలంటూ సూచించడంతో నాయకులు శాంతించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే క్రమంలో కామన్ డైట్ మెనూను ప్రారంభించి నెలరోజులు కూడా కాకముందే ఇలా జరుగడం గురుకులాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏ మేరకు ఉందో అర్థమవుతున్నదని మండిపడ్డారు. ఎప్పటిమాదిరిగానే నాసిరకం ఆహార పదార్థాలు సరఫరా చేస్తుండడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు విమర్శించారు.

బాధిత విద్యార్థినిని పరామర్శించి, వివరాలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్

### బాధ్యులను తొలగించాలి

బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో గురుకులాలు మానస పుత్రికలుగా వెలుగొందాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని, ఇందుకు శర్మనగర్‌లోని ఎంజేపీ బాలికల గురుకులంలో జరిగిన ఘటనే నిదర్శనమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్ ఆరోపించారు. ఫుడ్‌పాయిజన్ ఘటనకు బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల్లో నుంచి తొలగించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో మాట్లాడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే చికిత్స పూర్తికాకున్నా దవాఖాన నుంచి డిశ్చార్చి చేసి, ఆధార్ అప్‌డేట్ పేరిట తల్లిదండ్రులను పిలిపించి వారితో ఇండ్లకు పంపించారని మండిపడ్డారు. తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు రోదించిన తీరు తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. అయితే మల్టీస్పెషాలిటీ దవాఖానలు వదిలి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను చిన్నచూపు చూస్తుండడంతోనే గురుకులాల్లో వరుస సంఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. శర్మనగర్ గురుకులంలో ప్రిన్సిపాల్, పర్యవేక్షకులు, ఆహార సామగ్రి గుత్తేదారుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మున్ముందు ఇలాంటి సంఘటనలు జరుగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని, లేదంటే ప్రభుత్వం కండ్లు తెరిచే దాకా బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో శాతవాహన వర్సిటీ బీఆర్ఎస్‌వి ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, బీఆర్ఎస్‌వి నగరశాఖ అధ్యక్షుడు బొంకూరి మోహన్, నాయకులు ఆరె రవిగౌడ్, నారదాసు వసంత్, నరేశ్‌రెడ్డి, పరశురామ్, సతీశ్, వొడ్నాల రాజు, జెల్లోజి శ్రీనివాస్, నదీం, అన్వేష్, మహేశ్, మల్లేశ్, జావేద్, సోహెల్, మణిదీప్, అజయ్ ఉన్నారు.

## కరీంనగర్‌లో టెక్నికల్ యూనివర్సిటీని స్థాపించండి

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో బండి

విద్యానగర్, జనవరి 7: కరీంనగర్ జిల్లాలో టెక్నికల్ యూనివర్సిటీ స్థాపించాలని, అలాగే సిరిసిల్ల, సిద్దిపేటలోని హుస్నాబాద్ నియోజకవర్గం వంగరలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ప్రతి మండలంలో రెండు పాఠశాలలను ప్రధానమంత్రి శ్రీ స్కీమ్ కింద స్థాపించాలని అభ్యర్థించారు. బండి సంజయ్ వినతిపై సానుకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పట్టణాభివృద్ధికి ముందుంటా: మున్సిపల్ చైర్‌పర్సన్

హుజూరాబాద్ టౌన్, జనవరి 7: పట్టణాభివృద్ధికి ముందుంటానని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో రూ.4ల క్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంగళవారం వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాకర్స్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, ఈ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ తాళ్లపల్లి శ్రీనివాస్, అపరాజ ముత్యం రాజు, తొగరు సదానందం, పాలకిషన్, ముక్క రమేశ్, కుమారస్వామి, రమాదేవి, లావణ్య, యాదగిరి నాయక్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులతో పాటు ఇన్‌చార్జి ఏఈ సాంబరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

గంగాధర, జనవరి 7: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు అన్నారు. మంగళవారం గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను మరిచిన కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకోవడం సిగ్గుచేన్నారు. మోసంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, ఎండీ నజీర్, ఆకుల శంకరయ్య, నాయకులు ఆకుల మధుసూదన్, దూలం శంకర్‌గౌడ్, రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

తెలంగాణచౌక్, జనవరి 7: ఆర్టీసీ కార్గో కూలీల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తప్పవని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హెచ్చరించారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు కూలిరేట్లు పెంచాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఉచిత బస్సు పాస్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇక్కడ కార్మిక నాయకులు పోచయ్య, వెంకటయ్య, కిషన్, రమేశ్ ఉన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

ఇల్లందకుంట/ మానకొండూర్ రూరల్, జనవరి 7: కామారెడ్డి డిక్లరేషన్ బహిరంగ సభలో ప్రకటించిన విధంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇల్లందకుంట, మానకొండూర్ మండల తహసీల్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోపోతే గ్రామ స్థాయి నుంచి ఉద్యమం చేపట్టి, బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇల్లందకుంటలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు అజయ్, సమ్మయ్య, వీరస్వామి, సురేందర్, మురళి, దుర్గయ్య, రాజేశ్, రాజు, మానకొండూర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు మార్కొండ రమేశ్ పటేల్, బీజేపీ మండలాధ్యక్షుడు రాపాక ప్రవీణ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వీణవంక, జనవరి 7: మండలంలోని ఘన్ముక్ల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోయిజ్‌బేగ్ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతితో పాటు 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి, మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు 7,8,9,10వ తరగతి వారికి పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3న హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉచిత కుట్టుమిషన్ల పంపిణీకి ..

కలెక్టరేట్, జనవరి 7: క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని క్రిస్టియన్ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి బి.పవన్‌కుమార్ తెలిపారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద అందజేసే ఈ కుట్టుమిషన్లు పొందేందుకు తెల్లరేషన్‌కార్డుదారులై ఉండి, ఒంటరి, వితంతువు, విడాకులు పొందిన, నిరాశ్రయులు, నిరుపేద, అనాథ కుటుంబాలకు చెందిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. అలాగే 21 నుంచి 55 ఏళ్లలోపు వయసు, కనీసం 5వ తరగతి వరకు చదివి ఉండాలని తెలిపారు. ఔత్సాహిక మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని, tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలు పొందుపర్చాలని, మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఎల్ ఎండీ ఠాణాను సందర్శించిన ఏసీపీ

తిమ్మాపూర్, జనవరి 7: ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ శుభం ప్రకాశ్ మంగళవారం సందర్శించారు. మండల వివరాలు, కేసుల గురించి ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. తిమ్మాపూర్ సర్కిల్ అంశాలపై సీఐ స్వామి, ఎల్ఎండీ స్టేషన్ పరిధి అంశాలపై ఎస్ఐ వివేక్‌తో మాట్లాడారు. పలు సూచనలు చేశారు.

## ప్రమాదాల నివారణ కోసమే రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు

హుజూరాబాద్ టౌన్, జనవరి 7: పట్టణంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్నామని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం హుజూరాబాద్‌లోని సైదాపూర్ మూల మలుపు వద్ద రంబుల్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ సీఐ తిరుమల్ గౌడ్, రూరల్ సీఐ పులి వెంకట్ గౌడ్, ఎస్సై యూనస్ అహ్మద్ అలీ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

తిమ్మాపూర్, జనవరి7: ఎల్ఎండీ కాలనీలోని సేయింట్ ఆంథోనీ పాఠశాలలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు రవాణా జాగ్రత్తలపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్డీవో విజయపాల్ రెడ్డి, ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ హరిత యాదవ్, స్కూల్ ప్రిన్సిపాల్ రంజిత్‌రెడ్డి, సిబ్బంది తిరుపతి, శ్రీనివాస్, గౌస్ పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కరీంనగర్ రూరల్, జనవరి 7 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్ మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులు చదువుకొనే సమయంలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మాదక ద్రవ్యాలు, వాటిని సేవించే వారికి దూరంగా ఉండాలన్నారు. సదస్సులో రూరల్ ఎస్ఐ లక్ష్మీరెడ్డి, పాఠశాల హెచ్ఎం పాల్గొన్నారు.

## మెనూ పాటించని వార్డెన్లను సస్పెండ్ చేయాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 7 : ప్రభుత్వ వసతి గృహాల్లో నూతన మెనూ పాటించని వార్డెన్లను సస్పెండ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు తీర్మానం చేశారు. మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ, మెనూ పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులను ఐక్యం చేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ సంపత్, అభిలాష్, రాజకుమార్, అభి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మికులకు విముక్తి కల్పించాలి: కలెక్టర్

కలెక్టరేట్, జనవరి 7: జిల్లాలోని బాలకార్మికులకు పని నుంచి విముక్తి కల్పించి, బడిలో చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 31వరకు చేపట్టనున్న బాలకార్మికుల స్పెషల్ డ్రైవ్‌పై సంబంధిత అధికారులతో మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా అన్ని పని ప్రదేశాల్లో బాలబాలికలను గుర్తించాలన్నారు. చిన్న పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీలు, క్వారీలు, ఇతర ప్రదేశాల్లో శిశు సంక్షేమం, కార్మికశాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి మాట్లాడుతూ, రేపటి తరం బాగుండాలంటే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన తప్పనిసరి అన్నారు. అనంతరం ఆపరేషన్ స్మైల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేవంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, జిల్లాసంక్షేమాధికారి సబిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీఎల్ సామ్యూల్, సీఐ రవీందర్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డీఈవో జనార్దన్, డీసీపీవో పర్వీన్, సీడీపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 7: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించేతత్వం పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై ఉందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో (జనగాం, వనపర్తి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో జరిగిన) ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రతిభ చూపిన రత్నం గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. మూఢనమ్మకాల నిర్మూలనతోపాటు విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి, అభిరుచి, విశ్వాసం కలిగేలా జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని కొనియాడారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్ రావు, జన విజ్ఞాన వేదిక కమిటీ బాధ్యులు ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీరెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్, మహేందర్, సి.రామరాజు, సంపతి రమేశ్, జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు ఆర్ వెంకటేశ్వరరావు, శంకర్, ఎన్ దేవేందర్, జి. అశోక్, రాజమౌళి, శ్రీహరి, రత్నం గ్లోబల్ హైస్కూల్ చైర్మన్ రత్నమయ్య, కరస్పాండెంట్ రమేశ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'అల్ఫా' శిక్షణ

కమాన్‌చౌరస్తా, జనవరి 7: ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవీ సంస్థాన్ ఎన్జీవో ద్వారా జిల్లాలోని గంగాధర మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'అల్ఫా' శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి శిక్షణ ప్రణాళికపై ఎన్జీవో ఆర్గనైజర్ సునీతగాంధీ, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావుతో కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'అల్ఫా' (Accelerated Learning For All) లో భాగంగా విద్యార్థులకు కనీస భాషా, గణిత సామర్థ్యాలపై 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు దేవి సంస్థాన్ సంస్థ ముందుకు వచ్చిందని, కోచింగ్ సహా, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తారని చెప్పారు. సమావేశంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గంగాధర ఎంఈవో ప్రభాకర్ రావు పాల్గొన్నారు.


**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఊరడి బాపురెడ్డి, S/o. రాజిరెడ్డి, R/o. హనుమాన్‌నగర్, కరీంనగర్ జిల్లాగారు కరీంనగర్ టౌన్‌లోని కట్టరాంపూర్ లోకాలిటీలో సర్వే నెం 869/E, ప్లాటు నెం. 74, విస్తీర్ణం 242 చ.గ.లు గల దానిని చిట్టి రజిత, W/o. శ్రీనివాస్ రెడ్డి, R/o. విద్యానగర్, కరీంనగర్ గారి నుండి రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 6486/2014 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్లు రిజిష్టర్డ్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కం GPA డీడ్ నెం. 4536/2006 మరియు రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం. 1224/1991 గలవి పోయినవని ఊరడి బాపురెడ్డి గారు తెలిపినారు. కావున ఇట్టి దస్తావేజులపైన లేదా పై ప్రాపర్టీపైన ఎవరికైన అభ్యంతరములు ఉన్న యెడల వ్రాత పూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారిక